# బంధం

క్రింద ఏదో కలకలం. కాఫీ తాగుతున్న నేను పైనుంచి క్రిందికి చూసాను. హాస్పిటల్ సిబ్బంది అంతా గుంపుగా ఉండడంతో ఏదో జరిగి ఉంటుందని అనిపించింది.

నైటీ మార్చి చీర కట్టుకుని కిందకొచ్చాను.

నన్ను చూడగానే అంతా నిశ్శబ్దంగా ఉండిపోయారు. గుమ్మం దగ్గర ఓ బట్టలో చుట్టి ఉన్న ఓ చిన్న బేబీ!

"ఎప్పుడు పెట్టిన్రో ఏందో ఏమోనన్నా! ఐదు గంట్లకి ఎప్పట్లక్క లేచి తలుపు తీసి చూసిన. జల్దీ మానెమ్మని పిలిచిన. యిగ ఒక్కలెన్క ఒకల్లు వచ్చిన్రు." యాదమ్మ జరిగిందంతా చెప్పింది.

సూర్యకిరణాలు యింకా భూమిని తాకక ముందే, బద్దకంగా ఉన్న ప్రకృతి పూర్తిగా ఒళ్ళు విరుచుకోకముందే, నర్సింగ్‌హోంలో సంపూర్ణ చైతన్యం వచ్చేసింది.

పరీక్షగా చూసాను. రెండు రోజులు. అంతకన్నా పెద్దకావచ్చు, చిన్నా కావచ్చు. బొడ్డు చుట్టు ఓ నూనె చుక్క కూడా రాసినట్లు లేదు. ఆమె ఆడపిల్ల. అదే అందర్నీ కలవర పర్చింది.

'రెండు రోజుల గుడ్డు. అలా వదిలి పోవడానికి ఆ తల్లి రెండు రోజులు ఆలోచించిందా! ఎంత నిర్దయురాలు. ఆ తల్లి ఎవరై ఉంటుందీ? స్టూడెంటా? చదువురాని అజ్ఞానురాలా? రేప్ ఫలితమా? క్షణికానందమా!"

'ఏదైనా యింత దూరం ఎందుకు రానిచ్చారో! కడుపు తీయించాల్సింది. ఇలా బయట పారేసేదానికన్నా అది నయం కాదా!"

నిశ్శబ్దంగా చూస్తున్నాను. నా పక్కనే ఆనంద్, నా భర్త నుంచున్నాడు. 'ఏం చేయ్యాలి?' అంటూ ఆయా చేతిలోకి తీసుకుంది. ఉలిక్కిపడి, చేతులు పైకెత్తి సన్నగా 'కేర్' మంది, పాప.

ఒకళ్ళ తర్వాత ఒకళ్ళు చేతులు మారుతోంది. ఆఖరికి దైవాధీనం చేతిలోకి వచ్చింది. నల్లతుమ్మ చెక్కల్లా ఉన్న వాడి చేతుల్లో గులాబి రేకుల్లా ఉన్న గుడ్డు. వాడి కళ్ళు ఆ పిల్లని పైనుంచి కిందివరకూ పరిశీలనగా చూస్తున్నాయి. నా ఆలోచనలు చాలా దూరం వెళ్ళిపోయాయి. అది విపరీతమా! ఏమో... నాకు తెలీదు... ఒకలాటి ఫీలింగ్... జుగుప్స.

స్ప్రింగ్‌లా ముందుకెళ్లాను.

"మానెమ్మా! పాలు పట్టి, స్నానం అదీ చేయించండి. మీరందరూ మీ పన్లు చూసుకోండి." అని వెనక్కి తిరిగాను. అందరిలో చలనం వచ్చింది.

"ఇది చిన్న నర్సింగ్‌హోం. యిలాటిది ఎప్పుడూ జరగలేదు. నువ్వు అంతలా డెసిషన్ ఎలా తీసుకున్నావ్! నన్ను అడగద్దా!" ఆనంద్ సీరియస్‌గా అన్నాడు, అందరూ వెళ్ళిపోయాకా.

నిశ్శబ్దంగా ఆనంద్‌నే చూసాను.

"నిజమే! కానీ, దైవాధీనం చేతుల్లో ఆ చిన్నపిల్లని చూసాకా ఎలానో అనిపించింది. స్పాంటేనియస్‌గా వచ్చిన మానవత్వపు స్పందన అది. అందుకే సడన్‌గా అనేసాను."

"ఏమో! మనం యిక్కడేం పర్మనెంట్ కాదు. నాకు సౌదీలో ఆఫర్ వచ్చేటట్లుంది. ఏమో! నువ్వు ఎట్లా చూస్తావో! అయినా డాక్టర్ మాథ్యూస్‌తో మాట్లాడుతాను. ఇది వాళ్ళ హాస్పిటల్. నమ్ముతారో లేదో! ఏ అనాథాశ్రమంలోనో యిచ్చేద్దాం. అంతే కానీ, యిక్కడుంచక్కర్లేదు."

"అంతవరకూ యిక్కడే ఉండనీ." అన్నానే కానీ, నాకూ బెంగగా అనిపిస్తోంది. ఏ ధైర్యంతో పాపని ఉంచెయ్యమన్నాను. నాకే తెలీదు.

ముభావంగా ఆనంద్ వెళ్ళిపోయాడు.

డ్యూటీ రూంలో నా టేబిల్ పక్కనే ఉయ్యాల్లో పడుకోపెట్టారు. దగ్గరగా వెళ్లాను. తెల్లటి జుబ్బాలో ముడుచుకున్న గులాబి మొగ్గలాగా ఉంది. అక్కర్లేదని విసిరి

పారేసిన ఓ ఆడపిల్లకి నీడనిచ్చాను. చూడ్డానికి ముద్దుగా ఉంది. రెండు చేతులు ఒణుకుతున్నట్లుగా కదిలించింది.

"సిస్టర్!" అని పిలిచాను.

"బాగా చలిగా ఉంటోంది. లైటు పెట్టండి" సిస్టర్ వచ్చాక అన్నాను.

మరు నిమిషంలో ఓ బ్లాంకెట్ తెచ్చి ఉయ్యాల మీద వేసి లైటు పెట్టి వెళ్ళింది.

టైం ప్రకారంగా అంతా డ్యూటీలు వేసుకుని పాపని చూస్తున్నారు. ఆ మర్నాటి నుంచి విరోచనాలు. ఎందుకో భయంగా అనిపించింది. ఏమయినా అయితే! ఆనంద్‌ని అడిగి మా బెడ్‌రూంలోకే ఉయ్యాలని మార్పించాను. రాత్రింబవళ్ళూ నేనే ఆదారా నీళ్ళు పట్టి, మందులిచ్చి సేవ చేసాను. పువ్వులా, గాజుబొమ్మలా చాలా జాగ్రత్తగా అందరం చూసాం.

ఏనిమిదేళ్ళ మా బాబు కుతూహలంగా చూస్తున్నాడు. మధ్య మధ్య ఆనంద్ కూడా చూస్తున్నాడు. రెండు రోజులు గడిచాకా విరేచనాలు తగ్గాయి. క్రిందకి పాపని మార్పించాము. తెగకుండానే పాశం అల్లుకుంటోంది. ఈ బంధం ఎక్కడికి లాగుతుందో!

అద్దంలో మొహం చూసుకుంటూ జట్టుని సరిచేసుకుంటున్నాను. "రాత్రంతా సరిగా నిద్ర పోలేదు. చాలా టైర్డ్‌గా అనిపిస్తోంది." అన్నాడు.

"చెప్పాల్సింది నాకా! కింద ఉన్న ఆ పాపకెళ్ళి చెప్పు!" అద్దంలోని నా ప్రతిబింబాన్ని చూస్తూ అన్నాడు. నా వెనకాలే నుంచున్న ఆనంద్.

ఎక్కడో కలుక్కుమంది.

'పాపని అక్కడా, యిక్కడా ఎందుకు? మనమే పెంచుకుందాం' అని నా మనసులో ఉన్నా అనలేకపోతున్నాను. ఎందుకు? నాకు ధైర్యం లేదా! లేకపోతే నా అభిప్రాయం చెప్పగలిగే స్వతంత్రం నాకు లేదా! ఈ స్వతంత్రం ఎవరో యిచ్చేదా! నా మీద నాకే నమ్మకం లేదా! లేకపోతే ఏ మూలో నేను చేస్తున్నది మంచి అవుతుందన్న నమ్మకం, విశ్వాసం లేదా! ఎన్ని వేల యుగాలైనా ఆడది ఆడదే. ఆలోచనలని కార్యరూపంలో పెట్టాలనుకున్నప్పుడు స్వతంత్రించలేకపోతోంది. కారణం ఏదైనా కావచ్చు.

"ఈ బేబీ ఎప్పుడూ మన బెడ్‌రూంలోనే ఉంటుందా!" అని రెండు మూడుసార్లు బాబు అడిగానా ఆనంద్ నేను మౌనంగా ఉండిపోయాం.

"పాపం! మమ్మీ, డాడీ లేరు కదా! ముందు కొన్ని రోజులు హాస్పిటల్లో ఉంటుంది." అన్నాను కానీ, ఆ తర్వాతేమిటి అని అనలేకపోయాను.

నాకు తెలీకుండానే ఆనంద్‌కి నాకు మధ్య ఓ గీత ఏర్పడింది.

పెద్దదయ్యి అగాథం అవుతుందా! గీత చెరిగిపోతుందా! కాలమే చెప్పాలి.

డెలివరీ కేసుంటే తెల్లారుఝామున నాల్గుగంటలకే కిందకొచ్చాను. అదయ్యాకా ఓ రౌండు వేసి పైకి వెళ్ళాను.

బాబు పాలు తాగేసి స్కూలుకెళ్ళడానికి రెడీగా ఉన్నాడు. బాబుకి బ్రేక్‌ఫాస్ట్, లంచ్, సాయంత్రం స్నాక్స్ పాలు అన్నీ కూడా స్కూల్లోనే. అందుకే స్కూలు పది కిలోమీటర్ల దూరం అయినా అదే స్కూల్లో వేసాము.

కారు తాళాలు తిప్పుతూ, బాబుని తీసుకుని వెళ్తూంటే, ఎక్కడో నేనంటే నిర్లక్ష్యం కనిపించింది. ఈ పాప మూలంగానా! లేక పోతే నాదే తప్పా! ఏదైనా నా జీవితంలో అపశృతి మొదలయిందనిపించింది.

ఆడపిల్ల కాబట్టి, తల్లి వదిలేసిందా! ఆడపిల్ల కాబట్టి బాధ్యత తీసుకోడానికి ఎవరూ ముందుకు రావడంలేదా! ఇదే మొగ పిల్లాడయితే... ఈ ఆయాలే ఎవరో ఒకరు యింటికి తీసుకుపోయేవారా! అసలు ఆ తల్లే యిలా గుమ్మం ముందు వదిలేసేది కదా! కనిపారేసిన తల్లిమీద, రెండు క్షణాలు సుఖాన్ని స్వంతం చేసుకుని జీవితకాల దుఃఖాన్ని ఈ చిన్నిప్రాణానికి దారపోసిన ఆ తండ్రి మీద కోపం - అసహ్యం.... అన్నీ మిళితమై ఒక్కసారి కలిగాయి.

"ఈ నెలాఖరికి నేను జెద్దా వెళ్ళాలి. డాక్టర్ మాథ్యూస్‌కి ఈ పాప సంగతి చెప్పాను. ఈ నర్సింగ్‌హోంలోనే పెరుగుతుంది అన్నారు."

బాబుని దింపి వచ్చాకా యింకా డైనింగ్ టేబిల్ దగ్గరే ఉన్న నా ఎదురుగా కూచుంటూ అన్నాడు ఆనంద్.

"ఎంతకాలం?"

వింతగా చూసాడు.

"ఎప్పటికీ, యిక్కడే పెరిగి, పెద్దదయ్యి ఇక్కడే పని చేస్తుంది."

"లోకల్ ప్రాస్‌లాగా."

"అలా నెగిటివ్‌గా మాట్లాడకు."

"ఫొక్ట్. అనాథ ఆడపిల్లల బతుకులు అలాగే అవుతాయి. ఈ చిన్న పిల్లని అలా వదిలేయడం నాకు నచ్చడం లేదు.

"ప్లీజ్! మమకారం పంచుకోకు. నీ ఫీలింగ్స్ నాకర్థం అయ్యాయి. కానీ ... మనం పెర్మనెంట్ కాదు." శాంతంగా, అనునయంగా అన్నాడు.

ఎడారిలో దిక్కుతోచక ఉన్న నాకు చల్లగా ఊతగా అనిపించింది. "కానీ, ఆమె జీవితాన్ని ఊహించడానికే భయంగా ఉంది."

"అర్థం లేని భయం. ఆమెని కన్నవాళ్ళకే లేదు ఆ ఊహ."

"ఏమో! యిప్పుడు ఫర్వాలేదు. పెద్దయ్యాకా... ఏమైనా అయితే.... ఊహూ...నన్ను నేను ఎప్పటికీ క్షమించుకోలేను."

"ఒక్కటి అడుగుతాను. కన్నకూతురిలా పెంచగలవా!"

మౌనంగా కళ్ళెత్తి చూసాను.

" మన బాబుతో సమానంగా చూడగలవా! ఏ వస్తువైనా ఒక్కటే ఉందనుకో. యిద్దరిలో ఎవరికిస్తావ్? సహజంగా నీకు పుట్టిన బాబుకే కదా! సహజం. అదే సవితల్లి దృష్టి. నీకుఎంత విశాల భావాలున్నా కొన్ని చిన్న విషయాల్లో ఈ భేదభావం కనపర్చవచ్చు. పరిస్థితిని చూసి జాలిపడి పెంచినంత మాత్రాన కూతురి హోదా యివ్వలేవని నా నమ్మకం."

నిజమే అనిపించినా, ఒప్పుకోలేకపోతున్నాను.

"యిదివరకు అనేవాడిని, ఎవరినైనా తెచ్చి పెంచుకుందామని..."

"అది చాలాకాలం కిందటి మాట. మనకి బాబు పుట్టనప్పటి మాట. అప్పటి స్థితి వేరు. ఇప్పటిది వేరు. ఆలోచించుకో." తీవ్రంగా అన్నాడు.

ఆ గొంతులోని కాఠిన్యానికి కళ్ళల్లో నీళ్ళూరాయి.

తడిసిన కళ్ళని చూపించడం ఇష్టంలేక టేబిల్ మీద ఉన్న లిటరేచర్స్ చూడ్డం మొదలెట్టాను.

కేస్ వచ్చిందని ఫోన్ వచ్చింది.

నేను లేచి కిందకి వెళ్తూంటే ఆనంద్ చూపులు నన్నే వెంటాడుతున్నాయనిపించింది.

పది అవుతుండగా ఆనంద్ వచ్చాడు నారూంలోకి.

"చిన్న పిల్లలు అందులో మరీ చంటి పిల్లలు అందరూ ఇష్టపడే విధంగానే ఉంటారు. ఈ పాప ఎక్సెప్షన్ కాదు. ఏదో ఓ రోజున పాప నీ స్వంతం కాదు, ఎవరో పిల్ల అన్న భావం వచ్చినప్పుడు నీలో నీ ప్రేమలో మార్పుండచ్చు."

"స్వంత కూతురిలాగా కాకపోయినా, పెంచి పెద్ద చేద్దాం."

"అంటే నీకు చేతికిందగా, పనిపిల్లలాగా ఉంచుకోడానికా! అదింకా ఘోరం. నేరం. దేనికయినా లీగల్‌గా వెళ్ళాలి. ఏదైనా అనాథాశ్రమంలో ఉంచేద్దాం. లేదా ఇక్కడే ఉంచేద్దాం. అయినా ఇక్కడే శామ్యూల్ ఈ ఆయాల దగ్గరే పెరగలేదా!"

"శామ్యూల్ మొగపిల్లాడు గుర్తుపెట్టుకో."

"నెవ్వరెండింగ్... హు..." అంటు చివాలున వెళ్ళిపోయాడు.

పరిస్థితిని నేనర్థం చేసుకోవడం లేదా! ఆనంద్‌కి అర్థంకావడం లేదా! నాది మొండితనమా! పట్టుదలా! చలించని మానవత్వమా!

లేచి కిటికీ దగ్గరికొచ్చాను. హాస్పిటల్ ఆవరణ, రోడ్డూ కనిపిస్తోంది. గుత్తులుగా ఉన్న తెలుపు, పసుపు, మెజెంటా బోగన్ విల్లాలు సన్నగా ఊగుతున్నాయి.

గేటు ముందు కొన్ని సైకిళ్ళు, స్కూటర్లున్నాయి. చెట్లకింద కూచుని పేషంట్లు, వాళ్ళ తాలూకు బంధువులు కబుర్లు చెప్పుకుంటున్నారు.

సన్నటి తార్రోడ్డు ఊళ్ళోకి దారి తీస్తోంది. మూడు కుక్కపిల్లలు చాలా చిన్నవి పడుతూ, లేస్తూ అటూ యిటూ చూస్తూ రోడ్డు మీద నడుస్తున్నాయి.

ఎదురుగా యిసకలారీ వస్తోంది. ఆ డ్రైవర్ చూస్తాడా ఈ కుక్కపిల్లల్ని. లారీకి ప్రాణం లేదు. యంత్రం. ఈ చిన్న కుక్క పిల్లలకన్నా కొన్ని వందల రెట్ల బలం ఉన్నది కానీ, బుర్ర లేదు. అనంతకోటి ప్రాణుల్లో లోకాన్ని ఇప్పుడిప్పుడే చూస్తున్న చిన్ని ప్రాణాలు. రోడ్డు మధ్యగా ఆగి దిక్కులు చూస్తున్నాయి. ప్రాణంలేని యంత్రం కదలికకీ ఈ జీవాలు కదుల్తాయా!

కళ్ళు మూసుకున్నాను. లారీ బర్రుమని శబ్దం చేస్తూ వెళ్ళిపోయింది.

కళ్ళు తెరిచాను. బిక్క మొహాలేసుకుని రోడ్డు వారగా, హాస్పిటల్ గేటుకి దగ్గరగా నుంచుని యిటే చూస్తున్నాయి. ఈ స్పందనే చేతనాచేతనాల మధ్య వ్యత్యాసమా! బతకడంలోని వాటి స్వేచ్ఛ, వాటి తెలివి ఆ స్వేచ్ఛకి దోహదం చేసాయి.

మరి నా స్వేచ్ఛ, బతకడం ఒకటేనా స్వేచ్ఛా! నా ఆలోచనని కార్యరూపంలో పెట్టలేనిదా నా స్వేచ్ఛ. ఎందుకని?

ఆనంద్ విసురుగా టకటక శబ్దం చేస్తూ నా దగ్గరికొచ్చి నుంచున్నాడు. "చూడు లతా! ఓ పాపని పెంచుకోవాలని మనిద్దరం నిర్ణయం తీసుకుంటే సరిపోదా! మనకో బాబున్నాడు. బాబు చిన్నవాడని, వాడి అభిప్రాయం ఏమిటని అనుకోకు. చిన్నయినా, పెద్దయినా మనిద్దరి తర్వాత పాపకి యింపార్టెన్స్ యివ్వాల్సింది బాబు. ఆలోచించుకో..." ఎలా వచ్చాడో అలాగే విసురుగా వెళ్ళిపోయాడు.

మూవర్స్ అండ్ పాకర్స్ వాళ్ళు వచ్చి సామానంతా సర్ది ట్రక్‌లో పెట్టేసారు. అన్ని గదుదలు, అలమారాలు, పరుపుల కింద, దిండ్లకిందా మరోసారి చెక్ చేస్తున్నాను.

ఒక్కొక్కటే తాళం వేసి, మెట్లు దిగుతుంటే గొంతుని ఏదో పట్టేస్తోంది. కిందకి, గుండెల్లోకి దిగని బాధ.

హాస్పిటల్ స్టాఫ్ అంతా ఉన్నారు. కళ్ళ నీళ్ళు పెట్టుకుంటున్నారు. నన్ను అడగడానికి ధైర్యం లేని ప్రశ్నలు వాళ్ళ మొహాల్లో, వాళ్ళ చూపులకి అర్థం పాప.

వాళ్ళ మొహాల్లోని ప్రశ్న పాప. గిల్టీగా ఫీలవుతూ వాళ్ళ చూపుల్ని తప్పించుకుంటూ తాళాలున్న గుత్తి పట్టాభికిచ్చాను. ఏదో భయం, ఏదో అలజడి... ఏదో బాధ. నా డ్యూటీ రూంలోకెళ్ళాను. విశాలంగా ఉన్న ఆ గది నిశ్శబ్దంగా ఉంది. ఆకుపచ్చటి కర్టెన్లని తోసుకుంటూ లోపలికొస్తున్న ఎండ వెలుతురూ రెండూ కలిపి గదిని ఆకుపచ్చని రంగులోకి దింపాయి.

పెద్ద టేబిల్. దాని పక్కనే ఉయ్యాల. అందులో ఈ లోకానికక్కర్లేని ఓ నెల రోజుల గుడ్డు. ఒక్కత్తే ఉంది. ముందు ముందు కూడా ఒక్కత్తే కదా!

దగ్గరికెళ్ళాను. నిశ్చింతగా నిద్రపోతోంది. ఈ నిశ్చింత ఎంతకాలం? జీవితాంతం ఉండదు కదా!

మెల్లగా దగ్గరికెళ్ళాను. భుజాన ఉన్న బాగ్ లోంచి బాబు బట్టలు చిన్నప్పటివి, కొన్ని బొమ్మలు ఉయ్యాల్లో ఓ పక్కగా ఉంచాను.

"నన్ను క్షమించు! నేను నీలాగే ఆడదాన్ని... స్వేచ్ఛా స్వాతంత్ర్యాలున్నా లేనట్లే..."

కళ్ళు మసకలు బారాయి కన్నీళ్ళతో, గొంతులో బాధ. ఏదో బంధం అడ్డొస్తోంది.

ఉలిక్కిపడి కాళ్ళు చేతులు కదిపింది. బొమ్మలు, బట్టలు అడ్డు రావడంతో బలవంతంగా కళ్ళు తెరచింది.

అందులో నా దగ్గర జవాబులేని ప్రశ్నలు. ఏదో తప్పు చేస్తున్న భావం నన్ను వదలనివ్వడంలేదు.

బూట్ల శబ్దం, ఆనంద్, బాబు.

"కమాన్ యార్, వియార్ గెట్టింగ్ లేట్" అంటూ నా పక్కగా నుంచున్నాడు. మళ్ళా మా మధ్యన అగాధాల నిశ్శబ్దం.

"బాబూ! ఇలారా!" అంటూ పిలిచాడు.

"ఈ పాపని మనం తీసుకెళ్దామా!"

ఆశ్చర్యంగా చూసాను.

"వై డాడ్?" కేర్‌లెస్‌గా అన్నాడు.

"పాపం, పాపకి మమ్మీ, డాడీ ఎవరూ లేరు. మనం తీసుకెళ్దామా? మనింట్లోనే ఉంచుకుందామా!"

"లైక్ మై సిస్టర్?"

"యా."

రెండు నిమిషాలు ఆలోచించాడు.

"ఓ.కే. నేనే పెడ్తాను. నాకు నచ్చిన పేరు. కిరణ్ వాళ్ళ సిస్టర్ పేరు 'మిల్లి' ఏం బాలేదు. నేను మంచి పేరు పెడ్తాను. చాలా మంచిది. వెర్రి బ్యూటీఫుల్ నేం" ఒత్తులు పెడ్తూ, చేతులు తిప్పుతూ అన్నాడు.

"ఓ.కే..." అంటూ బాబుని ఆనందంగా ముద్దుపెట్టుకున్నాను.

నా భుజం మీద ఆనంద్ అరచేత్తో గట్టిగా నొక్కాడు.

ఆ స్పర్శ నాకో రక్షణలా అనిపించింది. నా నిర్ణయానికి కవచంలా అనిపించింది.

మనిషికి మనిషికి మధ్యనుండే మానవత్వపు బంధం అది.

మా భార్యభర్తల బంధం కన్నా గట్టిగా అనిపించింది.

❖ మే 2004, ఆంధ్ర భూమి మాసపత్రిక ❖

❖❖❖